నలిగిన హృదయం

శ్రీ కొంపల్లి బ్రహ్మానందరావు

స్వర్ణను తీసుకురావాలని వెంకమాంబ పట్టుపట్టి కొడుకు రామాన్ని పంపింది. మొదట్లో రామం వెళ్ళనని పట్టుపట్టాడు. కాని, తల్లి దుఃఖాన్ని చూసి 'ఊ' అనక తప్పిందిగాదు. మనస్ఫూర్తిగా రామం తన సోదర్ని పుట్టింటికి తీసుకురావటానికి వెళ్ళలేకపోయాడెందుకంటే స్వర్ణను క్షేమసమాచారములను అడిగి తెలుసుకునే వ్యక్తి ఒక్కడూలేడు వాళ్ళింటో; కట్టుకున్న భర్తకు లోకువయిపోయింది తన అక్క. ఆ సమయంలో ఇంక ఇతర మనుష్యుల సంగతేమిటి? అత్త తనఅక్కను దూషించని దినం గాని, చేయ్యి చేసుకోని దినం గాని లేదు. ఆడపిల్ల, చిన్న వయస్సులో ఉన్నపిల్ల, తనకూతురులాంటిపిల్ల అనే ఉదార స్వభావం కూడాలేదు ఆ అత్తగార్కి. కనీసం ఒకప్పుడు తనుకూడా ఒక అత్తింటి కోడలుగదా అని ఆలోచనకూడ లేకపోయింది ఆవిడకు. ఇంక ఆడబిడ్డ సంగతి చెప్పాల్సొస్తే అది పాఠకులకు వదిలివేయ వచ్చునేమో! ఆవిడ ప్రవర్తన చెప్పకుండానే గ్రహించ కల్గితేనే ఎక్కువగా అర్థమవుతుంది. ఒక్కమాట! ఒదినమీద చాడీలు చెప్పి గాని తను భోజనాన్కి కూర్చోదు!

రామం కంకిపాడులో దిగేటప్పటికి తెల్లారి ఐదుగంటలయింది. పల్లెలో అప్పుడే సందడిపూర్తిగా అంతరించింది. ఎవరి పనులలోవారు నిమగ్నులై ఉన్నారు. మగకుర్రాళ్ళు అప్పుడే ఒకచోట గుమిగూడారు. ఎవరికి చేతనయిన తేగల్గిన, ఎండుపేళ్లను వారు విరుచుకొచ్చారు వృక్షాల నుండి. దొరికిన ఎండుటాకులు పేర్చారు. పిన్నవయస్కులు తమ తమ ఇండ్లలోనుంచి చాటుగా పేళ్లను తీసుకొచ్చారు. అంతాఉమ్మడిగా మంట వేసుకున్నారు. వారివారి ఆనందం అవధిమీరుతుండడం చూడముచ్చటగా ఉంది. వేకువజామున లేచిన ముఖాలతో వారి కుతూహలం చూడ రమ్యంగా ఉంది.

ఊరి మధ్యలోకి వచ్చాడు రామం. చిత్రంగా అలికిన గృహాలు. సున్నంతో వెల్లవేసిన ఆ చిత్రరంగు మట్టిగోడల మీద చూస్తూంటే రామం కళ్లు తిరిగేలున్నాయి. "నిజంగా ఆ తెల్లగీతలు ఎంతశోభనిచ్చాయి ఆగోడకి!! ఎంత సిమెంటు కాంక్రీటు ఇల్లయినా అంత అందాన్ని చేకూర్చిందా తన బస్తీలో. అంత వినోదాన్నిచ్చేప్రదేశం పల్లెలే గదా! బస్తీలు ఏకోశకు వస్తాయ్!" అనుకున్నాడు రామం.

మరి కొంతదూరం సాగాడు. ముగ్గుల డబ్బాలతో ఇంటింటా ఆడపిల్లలు ఊగుతుంటే ఎంతో చూడముచ్చటగా ఉంది. మరోపనంటూలేక, ఎంతో హుషారుతో, చెదిరిన తల వెంట్రుకలతో గుమ్మాల ముందు రకరకాలయిన ముగ్గులను గీస్తూఉంటే రామంకు కదిలిరాబుద్ధవలేదు. ఎంత అందాన్ని ఇస్తాయి ఆ ముగ్గులు? రంగు రంగులతో అలంకరించాలని, ప్రత్యేకంగా ఇతరదేశాలనుండి దిగుమతి జేసుకుని, చివరకు పేడపూసినట్లు ఎంత అధ్వానంగా తయారయాయి తన బస్తీఇండ్లు? ఏంతో ఉపేక్షతో ఎన్నో ఆలోచనలతో, ఎంతో చాకచక్యంతో, ఎంతో జాగ్రత్తను వహించి, ఆ పిల్లలు ముగ్గులు పెట్టూన్న ఆ గృహాలు మట్టి గృహాలు అయినప్పటికీ ఆ బస్తీ ఇండ్ల ముందు ప్రముఖ స్థానం అలంకరించ గలవనడానికి సందేహంలేదు.

పండగ పూటయినా తమ బాధ్యత మానకుండా భుజాన బరువును వహించి నడిచిపోతున్న ఆ రైతులను చూసేసరికి రామం అదొకలాగు చలించాడు. రైతుపని ఎంత హాయి! అతడు కష్టించి పనిచేస్తేనేగదా జనం భూమి మీద నివసించ కల్గేది. ఎంతటి దయార్ద్ర హృదయుడు. మరో చీకు లేకుండా తను చేయవలసినపని చేసుకు పోతున్నాడు గదా! ఈరోజుల్లో ప్రజాసేవ అంటూ చేయకల్గితే అతడే గదా!

రామం ఓగుమ్మం ముందు ఆగాడు. తను వెళ్ళవలసిన గృహం అదే. తన అక్కఇల్లు అదే! కాదు — కాదు తన అక్క భర్తగారి ఇల్లు అదే. లోపలికి అడుగు పెట్టడం రామానికి ఇష్టంలేక పోయింది. వెనుతిరిగి వెళదామనుకొని బయలుదేరాడు. కాని తను వచ్చినపని వేరే ఉంది. అంతవరకు వచ్చి అక్కను కలుసుకోకుండా వెళ్ళటం ఏదోలా అనిపించింది.

వెనక్కు తిరిగి గడపలో అడుగుపెట్టాడు. ప్రథమంగా ఎదురయింది తన అక్కగారి ఆడబిడ్డ. తననుజూసి విసురుగా లోపలికి పోయింది. ఆవిడ తరువాత కిటికీలోంచి

నలిగిన హృదయం

అత్తగారి దర్శనమయింది. ఎదురుగా వచ్చారు బావగారు.

"అక్కయ్య ఎక్కడుంది? " అని అడిగాడు రామం.

"ఎందుకూ?" అని అడిగాడు కోపంతో బావగారు.

"పండక్కి ఇంటికి తీసుకుపోవటానిక్కి"

"నీళ్ళకు పోయింది చెరువుగట్టుకు"

అలానే నిలబడి చూస్తున్నాడు రామం. అక్క ఎంత సేపటికీరాలేదు. బావమరిది వచ్చాడు. కనీసం కూర్చోమని కూడా అనలేదు సరి గదా! మర్యాదకూడ చేయలేదు బావగారు. అందుకు రామం ఆశ్చర్య పడలేదెందు కంటే దారిపొడుగునా తను అనుకున్నదే అది. తను రావటం బావకు ఏమాత్రం ఇష్టం ఉండదని తెలుసు రామాన్కి.

ఊరంతా పండుగ సరదాలతో నిండిపోయి ఉంటే తన అక్కగారిల్లు ఎలాఉందో చూశాడు రామం. గొప్ప వ్యత్యాసం కనిపెట్టాడు. అందుకు కారణం తన అక్కే అయిఉండదు, అత్తగారు మాత్రమే అయిఉండాలి. మరో సహకారం లేకుండా ఎంతభారం వహించ కల్గుతుంది తన అక్క? ఎన్నిపనులు చేయకల్గుతుందీ !

"ఏంరా? ఎప్పుడు వచ్చావు?" అని అడిగిందాకా తను తన ఆలోచనల్ని త్యజించలేక పోయాడు రామం.

"ఇప్పుడే అక్కా వచ్చింది"

లోపలనుంచి కేక వినబడింది "తీరిగ్గా మాట్లాడ వచ్చును గాని, నీళ్ళు పట్టుకురావే త్వరగా" అని అత్తగారు అంది.

స్వర్ణ తమ్ముడితో మాటేమీ మాట్లాడకుండా ఒకడుగు తరువాతఅడుగు బరువుగా వేస్తూ లోపలికి పోయింది. అక్కతోబాటు రామంకూడా లోపలికిపోయి ముందు వసారాలో క్రింద పరిచియున్న పాత చాపమీద చతికిల బడ్డాడు.

అక్క. ఇంట్లో తమ్ముడికి జరిగిన అవమానంను గురించి బాధపడుతున్నట్లు కనిపెట్టాడు రామం.

తాను సమయాన్కి ఇంట్లో లేకపోతే తమ్ముడితో ఆమాత్రం మాట్లాడే వ్యక్తిగాని, కనీసం కూర్చోమనిచెప్పే వ్యక్తిగాని లేకపోయారు ఆ ఇంట్లో. ఎందుకు తనవారు అంటే వాళ్ళకి అంత కసి? దీనికి జవాబు ఒక్కటే దొరి కిందామెకు- క్రిందటి పండక్కి సరిగ్గా చూడలేదనేనెపం. చేతనయితే తను కొనుక్కోవాలి, అంతేగాని తండ్రిమీద అధికారం చెలాయించి అవీ, ఇవీ కొనివ్వమని వేధిస్తే ఎక్కడనుంచి తేగలడు. మిగిలిన కుమార్తెల సంగతి ఆలోచించవద్దూ. ఇంటి పెద్దల్లుడు గదా అని అప్పటికే తండ్రి అన్ని హంగులూ గౌరవముగా జరిపించాడు. ఆమాత్రం ఇంగితజ్ఞానం అక్కరలేదా పురుషుడికి?

తను ఆలోచించు కుంటున్న వ్యక్తి తనభర్తే అని మనస్సులో ఎవరో చెప్తున్నట్లు తోచింది స్వర్ణకు. తను ఇక్కడికి వచ్చిన తరువాత తండ్రయినా తల్లయినా, భర్త యినా ఆ ఇంట్లోనే. ఇంక తనకు ఏవిధమైనటువంటి సంబంధంలేదు తన పుట్టింటి వారితో.

అత్తగార్ని తృప్తిపర్చి తమ్ముడి చెంతకు వచ్చింది. కొద్దిసేపు మాత్రమే అతనితో మాట్లాడి పంపివేయాలను కుంది. ఎందుకంటే తను చేయవలసిన పనులు చాలా ఉన్నయ్ అత్తగారి దృష్టిలో.

"అమ్మ కులాసాగాఉందా?" అని అడిగింది స్వర్ణ ఏదో బాధను మింగుకుంటూ.

"కులాసాగానే ఉన్నది అక్కా! పండక్కి ఇంటికి తీసుకురమ్మని పంపింది"

"తమ్ముడూ! రావటాన్కి వీలుండదు" అని దించు కున్న ముఖంతో అంది.

"ఎందుకూ?"

ఆప్రశ్న వస్తుందని స్వర్ణ అంతకు పూర్వమే అను కుంది. అటువంటి ప్రశ్న అడగటం తనకు ఇష్టంలేదు. ఎందుకంటే జవాబు ఏమిఇవ్వాలో తెలియదు కనుక.

"వీలుండదని చెప్పు తమ్ముడూ"

"బావ వద్దంటాడా?"

స్వర్ణ మాట్లాడకుండా తలవంచుకొని, కాలిబొటనవ్రేలు నేలకురాస్తూ నిలుచుంది.

"అయితే బావను నేనే అడిగిచూస్తాను" అన్నాడు రామం చలించినట్లు.

"వద్దులేరా! " అనగల్గింది స్వర్ణ కష్టంగా.

"అత్తగార్ని అడిగితే .... "

స్వర్ణ పరిస్థితి అర్థంచేసుకున్నాడు రామం. భర్తకు, అత్తకు లోబడిపోయింది తనసోదరి. అక్కను పంప

టాన్కి ఎవ్వరికీ ఇష్టం ఉండదనుకున్నాడు. స్వయంగా తానే బావను, అక్కను పంపించవలసిందని కోరమని తల్లి చెప్పిన మాటలు రామానికి జ్ఞప్తి వచ్చాయ్. తేల్చుకుని గాని వదలకూడదని నిశ్చయానికి వచ్చాడు.

ముందు గదిలోకి తొంగిచూశాడు బావకోసం. బావ, అత్తగారు కాఫీలో నిమగ్నులైయున్నారు. రామం వాళ్ళ ఆనంద సమయానికి ఎదురుపోవడం ఇష్టంలేక పూర్తయిందాకా ఇవతలగా వచ్చి నిలబడ్డాడు. మరికొంత సేపటికి బావ వెలుపలికి వచ్చాడు.

"పండక్కి అక్కను, నిన్ను తీసుకురమ్మని అమ్మ పంపింది బావా" అని అన్నాడు రామం.

"నాకు రావటాన్కి వీలుండదు. ఇంక దాని సంగతంటావా దాన్నే అడుగు" అని ముభావంగా అన్నాడు.

"అక్క నిన్ను అడగమంది బావా"

"నన్ను అడగటం దేనికి? దాని ఇష్టం! అమ్మ ఇష్టం!" అని ఇంకో షరతు కలిపి తల్లిమీద వేశాడు భారం.

ఇంతలో అత్తగారు బయటికి వచ్చింది.

"ఏం నాయినా పండక్కి తీసుకు పోవటాన్కి వచ్చావా?"

"అవునండి. బావను, అక్కను పంపిస్తే చాలా సంతోషం"

"ఆ- పోదూ!! ఆ పండక్కి పెట్టారూ! ఇంక ఈ పండక్కి పెట్టారు"

రామానికి తలకొట్టినట్టయింది మరో సమయంలో అయితే ఆవిడ్ని కొట్టబోయేవాడే రామం! కాని తను తొందర పడకూడదనుకున్నాడు. తన మీద కోపం అక్క మీద చూపుతుందని రామం కోపాగ్నిని అణుచుకున్నాడు.

"ఈ మారు తప్పకుండా వాళ్ళను పంపాలి మీరు!" అని దీనంగా అడిగాడు రామం.

"ఇంట్లో ఇంత చాకిరీ ఉంది గదా! పండగ మాకు కూడా ఉందిగా!"

"పోనీ అక్కను పంపితే——"

"ఏమో నాయనా దాని ఇష్టం. అయినా వాడ్ని విడిచి అది పుట్టింట్లో పండగ చేసుకుంటే సమంజసంగా ఉంటుందా?"

అర్థమయింది రామంకి. తన కొడుకుని పంపక పోగా కోడల్ని పంపటాన్కి కూడా ఇష్టపడటంలేదు అత్తగారు.

మళ్ళీ రామం అక్కనడిగాడు. ఏలాగయినా రమ్మని. అక్క మాట్లాడ లేదు.

"నువ్వే అడిగి చూడవే అక్కా" అని తిరిగి అడిగాడు రామం.

"లాభంలేదు తమ్ముడూ! ఈఇంట్లో అగ్నితప్ప నీళ్లులేవు"

"పోనీ చెప్ప కుండా వచ్చెయ్ అక్కా!"

రామం తెలివి తక్కువ తనాన్కి స్వర్ణ నొచ్చుకుంది. తనింట్లో తనకు జరిగిన అమర్యాద, తన కోరిక చెల్లించక పోవటం మొదలయిన పరిస్థితులు రామాన్ని అలాగు అనమని ప్రోత్సహించి ఉంటయ్. లేక పోతే అలా తొందర పడి మాట జారే మనిషి కాడు రామం. తన అక్క జీవితం ఆ ఇంట్లో ఉందని తెలుసుకో లేని అజ్ఞాని కాదు తన తమ్ముడు. ఇప్పుడు చెప్ప కుండా పుట్టింటికి వెళితే ఇంక తనకి పుట్టగతులుంటాయా ఈ ఇంట్లో! సంఘం ఊరుకుంటుందా?

"ఏమంటావ్ అక్కా!" అని అడిగాడు రామం కంది పోయిన మొహంతో.

"నేను రానురా" అని నిక్కచ్చిగా చెప్పింది స్వర్ణ.

"ఏం ఎందుకని?"

"నాకు ఇష్టంలేదు."

రామం అక్కతో మరో మాట మాట్లాడ కుండా వచ్చినదారిపట్టాడు. "తనింట్లో పూర్వం తృప్తిగా పండగ జరిపించలేదని తన అక్క కూడా మనస్సులో పెట్టుకుంది. పరిస్థితులు తెలిసి కూడా అక్క అలా బాధ పడింది అంటే రామం అక్క మీద విసుక్కున్నాడు. తనలాంటి ఆడ పిల్లలకు ఇంకా వివాహం చెయ్యాలి కదా అని ఆలోచించలేదు అక్క. ఇంటికి వచ్చి వేడుకొన్నా తన కోరిక చెల్లించక పోయారు." అని ఆలోచించుకుంటూ వెళిపోయాడు రామం.

రామం చేసిన హఠాత్తు చర్య స్వర్ణను బాధ పెట్టింది. తమ్ముడ్ని బాధ పెట్టినందుకు చింతిల్లింది స్వర్ణ. తను అనుకున్నది ఒకటైతే దైవం చేసింది మరొకటి అయింది. ఇంత మందికి ఇష్టం లేకుండా తను పండక్కి పుట్టింటికి పోవటం తనకు సమంజసంగా లేదని గ్రహించి, స్వర్ణ తమ్మునితో రానన్నది. కాని తమ్ముడు అనుకున్న భావం మరొకటి. దృష్టిలోంచి పోయిందాకా తమ్ముడ్ని చూసి, నలిగినహృదయంతో మళ్ళీ తన మామూలు దిన చర్యల్లో నిమగ్నురాలైంది ఆ ఇంటి కోడలు స్వర్ణ. ★